

వధూవరులను ఆశీర్వదిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ తదితరులు

వెనక్కి తగ్గేదే లేదు

● ఎన్నివేల కోట్లిచ్చినా ద్విభాషా విధానానికే కట్టుబడి ఉంటాం ● సీఎం స్టాలిన్ స్పష్టీకరణ

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానం ముసుగులో త్రిభాషా విద్యావిధానాన్ని అమలుపరిస్తే ఐదువేల కోట్లు, పదివేల కోట్ల మేరకు నిధులు విడుదల చేస్తామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెబుతున్న మాయమాటలకు మోసపోయేందుకు తాము సిద్ధంగా లేమని, ద్విభాషా విధానానికే కట్టుబడి ఉంటామని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మరోమారు స్పష్టం చేశారు. కొళత్తూరులో ఆదివారం ఉదయం పార్టీ స్థానిక నాయకుడు ఐసీఎఫ్ మురళీధరన్ కుమారుడి వివాహ వేడుకలో ఆయన పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వధూవరులు తమకు పుట్టబోయే పిల్లలకు అందమైన తమిళ పేర్లను పెడితే తాను చాలా సంతోషిస్తానన్నారు. 75 యేళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన ఏకైక పార్టీగా గుర్తింపు పొందిన డీఎంకేని ప్రత్యర్థులు వారసత్వ పార్టీ వారసత్వ పార్టీ అని విమర్శలు చేస్తున్నారని, పార్టీ నేతలే పార్టీకి వారసులనీ, కోట్లాదిమంది పార్టీ కార్యకర్తలే తనకు నిజమైన వారసులని స్పష్టం చేశారు. పరిమిత కుటుంబమే చింతలేని కుటుంబం అంటూ కుటుంబ నియంత్రణపై దేశమంతటా ప్రచారం జరిగినప్పుడు దక్షిణాది రాష్ట్రాల్లో ఆ పథకం సమర్థవంతంగా అమలైందని, తమిళులు కుటుంబ శ్రేయస్సుకంటే దేశ సౌభాగ్యానికే ప్రాధాన్యమిస్తారని, అదే రీతిలో రాష్ట్రాభివృద్ధికి కూడా దోహదపడతారన్నారు.

కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల జనాభాకనుగుణంగా నియోజకవర్గాల పునర్విభజన పేరుతో లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య తగ్గనుందని, ఈ పరిస్థితులను చూస్తుంటే అధిక సంతానానికి పిలుపునిచ్చి ఉంటే బాగుండేదనే ఆలోచన కలుగుతోందని ఆయన చమత్కరించారు. తమిళులు మొదటి నుండి సమాజాభివృద్ధికి, రాష్ట్రాభివృద్ధికి, దేశాభివృద్ధికి ఏది అవసరమో ఏది అనవసరమో విచక్షణ చేయగల సామర్థ్యం కలిగి ఉంటున్నారని, ఆ కారణంగానే రాష్ట్రానికి ఏ విద్యావిధానం మంచిదో స్వీయనిర్ణయం తీసుకోగలుగుతున్నారని, రాష్ట్రంలో ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు గాని ద్విభాషా విద్యావిధానమే తమకు శ్రేయస్కరమని దశాబ్దాలుగా భావిస్తున్నారని, బీజేపీ మినహా ప్రధాన ప్రతిపక్షాలన్నీ త్రిభాషా విద్యావిధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయనే విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. కేంద్రం నుండి ఎన్ని బెదరింపులు వచ్చినా వెరవకుండా ద్విభాషా విద్యా విధానమే మాకు ముద్దు అని ఎలుగెత్తి చాటగలిగిన సత్తా తమిళులకు ఉందని, ఆ ధైర్యంతోనే త్రిభాషా విద్యావిధానం ముసుగులో నిర్బంధ హిందీ అమలు ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని స్టాలిన్ పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ త్రిభాషా విద్యావిధానం రాష్ట్రంలో ప్రవేశించకుండా అడ్డుకుంటామన్నారు. ఈ వివాహ వేడుకలలో ఎంపీ రాజా, మంత్రులు పీకే శేఖర్‌బాబు, ఎం. సుబ్రమణ్యం, అన్బిల్ మహేష్ పొయ్యామొళి, మేయర్ ఆర్ ప్రియా, ఎమ్మెల్యే టీకేఎస్ ఇళంగోవన్ తదితరులు పాల్గొన్నారు.

9 ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలు

● మంత్రి పీకే శేఖర్‌బాబు

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాలవారిని ఆకట్టుకునేలా ఈ సారి రాష్ట్రంలో తొమ్మిది సుప్రసిద్ధ ఆలయాల్లో శివరాత్రి వేడుకలను నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ జన్మదిన ముందస్తు వేడుకల్లో భాగంగా డీఎంకే ఆధ్వర్యంలో హార్బర్ నియోజకవర్గం మన్నడి ప్రాంతం సెంబుదాస్ వీధి వద్ద పేదలకు ఉచిత అల్పాహారాన్ని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్‌తో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి నగరంలోని మైలాపూరు కపాలీశ్వరాలయంలో శివరాత్రి వేడుకలను ఆధ్మాతిక సౌరభాలను వెదజల్లేలా నిర్వహిస్తున్నామన్నారు. దైవారాధన, సంగీత కచేరీ, భజనలు తదితర కార్యక్రమాలతో భక్తులు జాగారం చేసేందుకు కూడా అనువైన పరిస్థితులు కల్పించామని, ఈ నేపథ్యంలో సుప్రసిద్ధ శైవాలయాలలో ప్రభుత్వం తరఫున శివరాత్రి వేడుకలు నిర్వహించాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా భక్తుల నుండి వినతి పత్రాలు అందుతున్నాయని చెప్పారు. 2022లో తొలిసారిగా మైలాపూరు ఆలయంలో నిర్వహించిన శివరాత్రి వేడుకలకు భక్తుల నుండి అపూర్వ స్పందన లభించడంతో 2023లో తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయం, కోవై జిల్లా పేరూరు పట్టీశ్వరస్వామి ఆలయం, తంజావూరు బృహదీశ్వరాలయం, తిరునల్వేలి నెల్లయప్పర్ ఆలయం, మైలాపూరు కపాలీశ్వరాలయంలో శివరాత్రి వేడుకలు జరిపినట్లు తెలిపారు. అదే విధంగా గతేడాది తిరుచ్చి జిల్లా తిరువానైక్కావల్ జంబుకేశ్వరాలయం, మదురై మీనాక్షి సుందరేశ్వర ఆలయంలో శివరాత్రి వేడుకలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ యేడాది తిరువారూరు జిల్లా త్యాగరాజస్వామి ఆలయం, తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడు సమీపం వఠారణ్యేశ్వరస్వామివారి ఆలయంలో శివరాత్రి వేడుకలను జరిపేందుకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అనుమతిచ్చారని, దీనితో ఈ నెల 26న రాష్ట్రంలోని 9 సుప్రసిద్ధ ఆలయాలలో శివరాత్రి వేడుకలను భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ తొమ్మిది ఆలయాల్లో శివరాత్రి రోజున భక్తులకు నిర్విరామంగా ప్రసాదాల పంపిణీ, తాగునీటి సరఫరా, భద్రతా ఏర్పాట్లు కల్పిస్తామన్నారు.



ప్యారీస్ కార్నర్ మన్నడి వద్ద పేదలకు అల్పాహారం వడ్డిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ప్రియ

నేడు సీఎం ఫార్మసీల ప్రారంభం

అడయార్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి "సీఎం ఫార్మసీ"లు సోమవారం ప్రారంభంకానున్నాయి. ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం నగరంలో జరిగే ఓ కార్యక్రమంలో ఈ ఫార్మసీలను ప్రారంభిస్తారు. వీటిలో చౌక ధరలకే మందులు లభ్యమవుతాయి. 2024 ఆగస్టు 15వ తేదీ జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో రాష్ట్రంలో జనరిక్ మందులతో పాటు ఇతర మందులను కూడా ప్రజలకు తక్కువ ధరకే విక్రయించేలా రాష్ట్రంలో సీఎం ఫార్మసీలను ప్రారంభిస్తామని స్టాలిన్ ప్రకటించారు. ఇందులోభాగంగా తొలి దశలో వెయ్యి ఫార్మసీల ప్రారంభోత్సవానికి అధికారుల ఏర్పాట్లు పూర్తి చేశారు. కోట్టూరుపురంలోని అన్నా సెంటినరీ లైబ్రరీ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో సీఎం స్టాలిన్ పాల్గొని వీటిని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహకార శాఖామంత్రి కేఆర్ పెరియకరుప్పన్‌తో సహా పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొంటారు. అంతకు ముందు పాండి బజార్‌లోని సీఎం ఫార్మసీని ఆయన పరిశీలిస్తారు. దీంతో సీఎం ఫార్మసీ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగే అన్నా సెంటినరీ లైబ్రరీ ఆడిటోరియం, పాండిబజార్‌లోని సీఎం ఫార్మసీ వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. ఇదే విషయంపై సహకార శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు చేకూర్చేలా, చౌక ధరకే నాణ్యమైన మందులను విక్రయించేలా సీఎం ఫార్మసీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఈ షాపుల్లో అన్ని రకాల మందులు 75 శాతం తక్కువ ధరకు లభ్యమవుతాయని, ఈ షాపుల ద్వారా వెయ్యి మందికి పైగా ఔత్సాహిక వ్యాపారవేత్తలను ప్రభుత్వం తయారు చేసిందని పేర్కొంది. కాగా, ఈ షాపులను బీఫార్మ్, డిఫార్మ్ పూర్తి పట్టభద్రులు నెలకొల్పేందుకు ప్రభుత్వం అనుమతిచ్చిన విషయం తెల్సిందే.



ప్రశాంతంగా గ్రూపు 2 మెయిన్స్

● 7967 మంది అభ్యర్థుల హాజరు

అడయార్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎన్‌పీఎస్‌సీ) ఆధ్వర్యంలో ఆదివారం గ్రూపు-2 పరీక్ష రాష్ట్ర వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. మొత్తం 534 పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన ఈ పరీక్షకు 7,967 మంది హాజరయ్యారు. ఈ పోస్టుల భర్తీ కోసం గత యేడాది జూన్‌లో నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రిలిమినరీ పరీక్షలు గత యేడాది సెప్టెంబరు 14న నిర్వహించగా డిసెంబరు 12న ఫలితాలను వెల్లడించారు. ఈ నేపథ్యంలో గ్రూపు-2 మెయిన్స్ ఆదివారం నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగిన ఈ పరీక్ష కోసం రాష్ట్ర వ్యాప్తంగా 41 కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 7 గంటలకే చేరుకున్నారు. పరీక్షా హాలులోకి మొబైల్ ఫోన్‌తో సహా ఎలక్ట్రానిక్ వస్తు పరికరాలను అనుమతించ లేదు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు భద్రత కల్పించారు. అలాగే, టీఎన్‌పీఎస్‌సీ అధికారులు పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు చేశారు.

ఓపీఎస్, దినకరన్‌లను పార్టీలో చేర్చుకోం

● అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఈపీఎస్

ప్యారీస్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే నుంచి తొలగించిన ఒ.పన్నీర్‌సెల్వం, టీటీవీ దినకరన్ సహా మరి కొంతమందిని ఎట్టి పరిస్థితుల్లోను పార్టీలో చేర్చుకొనే ప్రస్తకే లేదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి మరోమారు స్పష్టం చేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత 77వ జయంతిని సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నిర్వాహకులు ఘనంగా నిర్వహించాలని, పేదలకు సంక్షేమ సహాయలు అందజేయాలని ఈపీఎస్ లేఖ రాశారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత సేవలను కొనియాడుతూ ఆమె జయంతి రోజున వేడుకలు జరుపుకోవాలని సూచించారు. పార్టీకి వెన్నుపోటు పొడిచి అభివృద్ధిని అడ్డుకున్న కారణంగా తొలగించిన పన్నీర్‌సెల్వం, దినకరన్ సహా ఇతరులను మళ్లీ పార్టీలో చేర్చుకోబోమని, రాష్ట్రంలో మళ్లీ అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాల్సిన అవసరం ఉందని ఈపీఎస్ తన లేఖలో తెలిపారు.



టి.నగర్‌లోని పద్మావతి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం చంద్రప్రభ వాహనంపై విహరిస్తున్న అమ్మవారు.

లలిత గీతాలకు పుట్టినిల్లు మద్రాసు

● కవయిత్రి స్వాతి శ్రీపాద

వేళచ్చేరి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): లలిత గీతాలకు పుట్టినిల్లు మద్రాసు అని హైదరాబాద్‌కు చెందిన విశ్రాంత ఆచార్యులు, కవయిత్రి వక్త స్వాతి శ్రీపాద అన్నారు. వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 158 వ ప్రసంగ కార్యక్రమానికి ఆమె వక్తగా హాజరయ్యారు. 'సాహిత్యవనంలో లలిత సంగీత సౌరభం' అనే అంశంపై ప్రసంగించారు. టి.నగర్‌లోని ఆంధ్రా క్లబ్ కృష్ణా హాలు వేదికగా ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కందనూరు మధు సభికులకు స్వాగతం పలకగా, అరుణా శ్రీనాథ్ ప్రార్థన గీతం ఆలపించారు. వేద విజ్ఞాన వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి వక్తను పరిచయం చేశారు. పదేళ్ల ప్రాయంలో రచనలు ప్రారంభించిన ఆమె సుమారు 200లకు పైగా కథలు రాశారని తెలిపారు. వికాసం పురస్కారం, ఉత్తమ రచయిత్రి పురస్కారం, కీర్తి పురస్కారం సహా ఎన్నో పురస్కారాలు అందుకున్నారని వివరించారు. లలిత గీతాల్లో లయ విన్యాసం, మాత్రా చందస్సు ఉంటుందని, తేలిక పదాలతో రచన సాగుతుందని వక్త స్వాతి అన్నారు. లలిత గీతాల రచనల ప్రారంభంలో దేవులపల్లి, అడవి బాపిరాజు వంటి ఎందరో గొప్ప కవులు సాహిత్యం, సంగీతం మేళవించి రచనలు చేసారని, అవి సార్వజనీనకాలన్నారు. నండూరి సుబ్బారావు రాసిన ఎంకి పాటలు లలిత సంగీత సాహిత్యాలకు ప్రతీకలన్నారు. గురజాడ , కొనకొండ వెంకట రత్నం వంటి వారు రాసిన లలితగీతాలు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని స్వాతి శ్రీపాద అన్నారు. శారద అశోకవర్ధన్, నాగపద్మిని వంటి రచయిత్రుల లలిత గీతాలు కూడా ఎంతో ప్రసిద్ధాలన్నారు. నాటి నుంచి నేటి వరకు లలిత సాహిత్యంలోని ఆణిముత్యాల వంటి గీతాల గురించి ఆమె ఆహ్లాదకరంగా ప్రస్తావించారు. లలిత గీతాలను ఒక థెరపీలాగా ఉపయోగించుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. వేద విజ్ఞాన వేదిక నిర్వాహకులు వక్త స్వాతి శ్రీపాదను సత్కరించారు.



స్వాతి శ్రీపాదను సత్కరిస్తున్న వేదవిజ్ఞానవేదిక నిర్వాహకులు

మళ్లీ విరుచుకుపడ్డ శ్రీలంక నావికాదళం

● 32 మంది రామేశ్వరం జాలర్ల అరెస్టు ● 5 మరపడవల స్వాధీనం

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా శ్రీలంక నావికాదళం తమిళ జాలర్లపై దాడులు చేస్తూ అక్రమ నిర్బంధాలకు పాల్పడుతూనే ఉంది. అదే సమయంలో పడవలను, వాటిలో ఉన్న జీపీఎస్ పరికరం తదితర విలువైన వస్తువులను కూడా దోచుకోవడం ఆనవాయితీగా పెట్టుకుంది. అరెస్టయిన జాలర్లను విడిపించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జయశంకర్‌కు సీఎం స్టాలిన్ రాస్తున్న లేఖలు నిష్ప్రయోజనమవుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా శ్రీలంక నావికాదళం రామేశ్వరం జాలర్లపై విరుచుకుపడి 32 మంది జాలర్లను నిర్బంధించి తమ దేశానికి తరలించుకెళ్ళింది. రామనాథపురం జిల్లా రామేశ్వరం ప్రాంతానికి చెందిన సుమారు 200 మంది జాలర్లు శనివారం వేకువజాము సముద్రంలో చేపలవేటకు బయలుదేరారు. కచ్చాదీవి, నెడుదీవికి మధ్య సముద్రంలో ఆదివారం వేకువజాము ఐదు పడవల్లో రామేశ్వరం జాలర్లు చేపలు పడుతుండగా గస్తీ నౌకలో వచ్చిన శ్రీలంక నావికాదళం వారిపై దాడి చేశారు. తమ దేశ సరిహద్దుల్లోకి అక్రమంగా ప్రవేశించారంటూ పడవల్లో ఉన్న 32 మందిని నిర్బంధించారు. ఐదు మరపడవలను కూడా శ్రీలంకకు తరలించుకెళ్ళారు. ఈ విషయం తెలియగానే రామేశ్వరంలోని జాలర్ల సంఘం నాయకులు, అరెస్టయిన జాలర్ల కుటుంబీకులు తీవ్ర ఆందోళన చెందారు. శ్రీలంక నావికాదళం అరెస్టుచేసిన జాలర్లను విడిపించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు చేపట్టాలని జాలర్ల సంఘం నేతలు మత్స్యశాఖ ఉన్నతాధికారులు వినతి పత్రం సమర్పించారు.



శ్రీలంక నావికాదళం అరెస్టు చేసిన జాలర్లు



చేపాక్‌లో ముఖ్యమంత్రి స్టాలిన్ ముందస్తు జన్మదిన వేడుకల్లో భాగంగా పేదలకు సహాయాలు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, ఎంపీ దయానిధిమారన్, మంత్రి అన్బిల్ మహేష్

సమాచార దర్శిని

25, 26 తేదీల్లో శివరాత్రి ప్రత్యేక బస్సులు

పెరంబూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. మహాశివరాత్రి సందర్భంగా నగరం నుంచి తిరునల్వేలి, తిరుచెందూర్, సెంగోట్టై, మదురై, కారైక్కుడి, దిండుగల్, తేని, కోయంబత్తూర్ తదితర ప్రాంతాలకు ప్రజలు అధికంగా వెళుతుంటారు. ప్రజల సౌకర్యార్థం నగరం నుంచి 25వ తేది 50 ప్రత్యేక బస్సులు, ఆయా ప్రాంతాల నుంచి ప్రయాణికులు తిరిగివచ్చేలా 26వ తేది ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఎస్ఈటీసీ తెలిపింది.

ఇగ్నో కోర్సుల దరఖాస్తు గడువు పెంపు

పెరంబూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): దూరవిద్య జనవరి సెమిస్టర్ పరీక్షలకు దరఖాస్తు స్వీకరణ ఈ నెల 28వ తేది వరకు పొడిగించారు. ఈ విషయమై ఇగ్నో చెన్నై మండల డైరెక్టర్ పన్నీరసెల్వం విడుదల చేసిన ప్రకటనలో... ఇగ్నో ఆధ్వర్యంలో యూజీ, పీజీ, డిప్లొమో కోర్సులకు సంబంధించి జనవరి సెమిస్టర్‌కు విద్యార్థుల అడ్మిషన్ల దరఖాస్తు స్వీకరణ ఈ నెల 28వ తేది వరకు పొడిగించామన్నారు. విద్యార్థులు దరఖాస్తులను https://ignouadmissions.samarth.edu.in అనే వెబ్‌సైట్‌లో నమోదుచేయాలని, మరిన్ని వివరాలకు 044-26618040 నెంబరు సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

15 కొత్త మార్గాల్లో ఎక్స్‌ప్రెస్ బస్సులు

పెరంబూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 15 కొత్త మార్గాల్లో ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రారంభించాలని రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) నిర్ణయించింది. ఈ విషయమై ఎస్ఈటీసీ అధికారులు మాట్లాడుతూ... ప్రతిరోజు 1,080 మార్గాల్లో ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుపుతున్నామన్నారు. ప్రస్తుతం ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంతో, కొత్త మార్గాల్లో బస్సులు నడపాలని నిర్ణయించామన్నారు. ఆ ప్రకారం, కేరళ రాష్ట్రం వైకం-వేలాంకన్ని, కోవై-మన్నార్‌కుడి కొత్త మార్గాల్లో నడుపుతున్న బస్సులకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని తెలిపారు. తిరుచ్చి-తిరుచెందూర్ మార్గంలో కూడా ప్రయాణికుల రద్దీ అధికం కావడంతో ప్రస్తుతం నడుపుతున్న మూడు బస్సులు ఐదుకు పెంచామన్నారు. ఇవి మినహా 15 కొత్త మార్గాలు ఎంపిక చేశామని, అందులో మన్నార్‌కుడి-బెంగళూరు మార్గంలో త్వరలో బస్సు సేవలు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

సహకార శాఖ ఆధ్వర్యంలో ఏటీఎంలు

పెరంబూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం, నగదు డిపాజిట్ కేంద్రాలు ఏర్పాటుచేయాలని సహకార శాఖ నిర్ణయించింది. తొలివిడతగా 25 కేంద్రాలు ఏర్పాటు చేయనుంది. రాష్ట్రంలో సహకార శాఖ ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రధాన సహకార బ్యాంక్‌కు నగరంలో 51 శాఖలు, 23 జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లకు 924 శాఖా కార్యాలయాలున్నాయి. ఈ శాఖలున్న ప్రాంతాల్లో మాత్రమే ఏటీఎం కేంద్రాలున్నాయి. ఈ నేపథ్యంలో, కార్యాలయాలు లేని ప్రాంతాల్లో కూడా ఏటీఎం కేంద్రాలు ప్రారంభించాలని నిర్ణయించింది. తొలివిడతగా ప్రధాన బ్యాంక్ పరిధి ఒకటి, జిల్లా కేంద సహకార బ్యాంకుల ద్వారా 24 రాష్ట్రవ్యాప్తంగా 25 ఏటీఎం కేంద్రాలు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

పుస్తక ప్రదర్శనలో నృత్యం చేస్తూ కళాకారుడి మృతి

పెరంబూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పుస్తక ప్రదర్శన సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలో నృత్యం చేస్తూ కళాకారుడు మృతిచెందిన ఘటన విషాదానికి దారితీసింది. శివగంగ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన జరుగుతోంది. ప్రదర్శనలో భాగంగా శనివారం సాయంత్రం కళా ప్రదర్శన ఏర్పాటు చేశారు. శివగంగ అఖిలాండపురానికి చెందిన డాన్స్ ఉపాధ్యాయులు రాజేష్‌కన్నన్ (53) విద్యార్థులతో కలసి నృత్యం చేస్తూ హఠాత్తుగా కుప్పకూలారు. చుట్టుపక్కల వారు అతనిని వెంటనే 108 అంబులెన్స్ ద్వారా శివగంగ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, ఆయనను పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటన పుస్తక ప్రదర్శనలో విషాదం నింపింది.

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నెట్ సేవలు

పెరంబూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సర్వశిక్షా అభియాన్ పథకంలో ప్రభుత్వ పాఠశాలలకు బీఎస్ఎన్ ద్వారా ఇంటర్నెట్ సదుపాయం కల్పించారు. ప్రస్తుతం ఈ కనెక్షన్లను రెండు విభాగాలుగా విభజించారు. ఆ ప్రకారం, ప్రాథమిక పాఠశాలలు (50 ఎంబీపీఎస్) రూ.710, ఉన్నత, మహోన్నత పాఠశాలలు (100 ఎంబీపీఎస్) రూ.900 సేవా రుసుముగా అందజేస్తున్నారు. ఈ ఇంటర్నెట్ ఛార్జీలను పాఠశాల విద్యా డైరెక్టరేట్ ద్వారా ఏప్రిల్, మే నెలలకు చెల్లించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా విద్యాధికారులు, తమ పరిధిలోని పాఠశాలల్లో ఇంటర్నెట్ వసతి, బీఎస్ఎన్ఎల్ కాకుండా ఇతర ప్రైవేటు సంస్థల కనెక్షన్ల వివరాలను 'ఎమిస్' వెబ్‌సైట్‌లో నమోదుచేయాలి. ఇంటర్నెట్ లేని పాఠశాలల్లో సత్వరం బీఎస్ఎన్ఎల్ ద్వారా ఇంటర్నెట్ వసతి ఏర్పాటుచేసేలా చర్యలు చేపట్టాలని డైరెక్టరేట్ సర్క్యులర్ జారీచేసింది.

బస్సును ఢీకొన్న లారీ

● పదిమందికి గాయాలు

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా వడలూరు నాలుగురోడ్ల కూడలి వద్ద ఆదివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బెంగళూరుకు చెందిన పదిమంది గాయపడ్డారు. బెంగళూరు నుండి పుదుచ్చేరి కారైక్కాల్ సమీపం తిరునళ్లార్ శనీశ్వరాలయానికి 40 మంది భక్తులతో కర్ణాటక రాష్ట్ర రవాణా సంస్థ బస్సు శనివారం రాత్రి 10 గంటలకు బయలుదేరింది. ఆ బస్సు ఆదివారం వేకువజాము నాలుగు గంటల సమయంలో వడలూరు నాలుగురోడ్ల కూడలిలో వెళ్తుండగా ఎదురుగా వేగంగా వచ్చిన లారీ అదుపు తప్పి రోడ్డు డివైడర్ ఢీకొని బస్సును కూడా ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణించిన బెంగళూరుకు చెందిన మేరి (44), విద్యా(55), జయమాల (50), కోలారుకు చెందిన రామకృష్ణన్ (50), కృష్ణమూర్తి (52) సహా పదిమంది గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం కురింజిపాడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కడలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వడలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



ప్రమాదంలో అద్దాలు పగిలి ధ్వంసమైన కర్ణాటక బస్సు

విద్యార్థిని చితకబాదిన హిందీ టీచర్ సస్పెన్షన్

పెరంబూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ పాఠశాలలో 3వ తరగతి విద్యార్థిని చితకబాదిన హిందీ టీచర్‌పై సస్పెన్షన్ వేటుపడింది. స్థానిక కీల్పాక్కంలోని భవాన్స్ రాజాజీ విద్యాశ్రమం పాఠశాలలో శనివారం 3వ తరగతి విద్యార్థిని హిందీ కవిత చెప్పలేదనే కారణంగా హిందీ టీచర్ విద్యార్థిని కొట్టినట్లు సమాచారం. ఈ విషయాన్ని ఆ విద్యార్థి తల్లిదండ్రులకు తెలియజేయడంతో, విద్యార్థిని పాఠశాలకు పంపేది లేదని వారు పాఠశాల యాజమాన్యానికి స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో, హిందీ టీచర్ పద్మలక్ష్మిని సస్పెండ్ చేస్తూ పాఠశాల యాజమాన్యం ఉత్తర్వులు జారీచేసింది.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు

● వాచ్‌మేన్ అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కారైక్కుడిలో కళాశాల విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన వాచ్‌మేన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కారైక్కుడిలోని ఓ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని కళాశాల ప్రాంగణంలో హాస్టల్‌లో ఉంటోంది. ఈ హాస్టల్ వాచ్‌మేన్ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదుచేసిన కారైక్కుడి మహిళా పోలీసులు, వాచ్‌మాన్‌ను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

పోషకార ఉద్యోగి...

శివగంగ జిల్లా తిరుప్పూర్ సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో శరవణన్ (59) పౌష్టికాహార సిబ్బందిగా పనిచేస్తూ మూడు నెలల క్రితం పదవీ విరమణ చేశారు. ఈ క్రమంలో, గత శుక్రవారం పాఠశాలలో మహిళలు, పిల్లల భద్రతపై అధికారులు అవగాహన సమావేశం నిర్వహించిన సమయంలో, ఓ విద్యార్థిని తనను శరవణన్ వేధించారని ఫిర్యాదు చేసింది. అధికారుల ఫిర్యాదుతో తిరుపత్తూర్ మహిళా పోలీసులు కేసు నమోదుచేసి శరవణన్‌ను అరెస్ట్ చేశారు.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

పెరంబూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కోవై ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కోవై రత్నపురి పీఎం స్వామి కాలనీకి చెందిన ట్యూషన్ మాస్టర్ శివం-రాధామణి దంపతుల కుమారుడు నవీన్ (21) ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో సీఈసీ 3వ సంవత్సరం చదువుతున్నాడు. ఘటన జరిగిన రోజున నవీన్ కళాశాల నుంచి వచ్చిన సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. దీంతో, తన గదికి వెళ్లిన నవీన్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్దిసేపటికి ఇంటికి చేరుకున్న తల్లిదండ్రులు, నవీన్ ఆత్మహత్యకు పాల్పడడం గమనించి విలపించారు. సమాచారం అందుక్ను రత్నపురి పోలీసులు అక్కడకు చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, నవీన్ సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకొని, అతని ఆత్మహత్యకు దారితీసిన కారణాలపై విచారిస్తున్నారు.

చట్టవిరుద్ధంగా ఉంటున్న ఇద్దరు బంగ్లాదేశీయుల అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లాలో చట్టవిరుద్ధంగా ఉంటున్న ఇద్దరు బంగ్లా దేశీయులను పోలీసులు అరెస్ట్‌చేశారు. అక్రమంగా దేశంలో ప్రవేశిస్తున్న బంగ్లా దేశీయులు పశ్చిమబెంగాల్‌కు చెందిన వారిమంటూ నకిలీ ఆధారాలతో తిరుప్పూర్, కోవై సహా పలుజిల్లాల్లోని కర్మాగారాల్లో పనిచేస్తున్నారని పోలీసుల విచారణలో తెలిసింది. దీంతో, తిరుప్పూర్ జిల్లాలోని బనియన్ కంపెనీల్లో తనిఖీలు చేపట్టిన పోలీసులు ఇప్పటివరకు సుమారు 75 మందిని అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో, కరుంపాళయం ప్రాంతంలో చట్టవిరుద్ధంగా బసచేస్తున్న బంగ్లాదేశ్‌కు చెందిన హుసేన్, ఇబ్రహీంలను శనివారం అరెస్ట్ చేశారు. వీరు 9 ఏళ్లుగా ఈ ప్రాంతంలో బసచేస్తున్నట్లు పోలీసుల విచారణలో తెలిసింది.

మతిస్థిమితం లేని యువకుడి హత్య

ప్యారీస్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరంలో మతిస్థిమితంలేని ఓయువకుడిని హత్యచేసిన కేసులో న్యాయవాది సహా విద్యార్థిని అరెస్ట్ చేశారు. అయనావరం ప్రాంతానికి చెందిన రంగనాథన్ (28) ఈనెల 19వ తేది నుంచి తాంబరం బస్టాండ్‌లో సంచరించాడు. ఆ రోజు తెల్లవారుజామున ఒంటి గంటకు బస్టాండ్ వద్ద ఉన్న ఓ కారు అద్దాలను ధ్వంసం చేసిన రంగనాథన్‌పై ఆ కారులో వచ్చిన న్యాయవాది మణికంఠన్, లా విద్యార్థి వినోద్ కలిసి దాడి చేయడంతో అతను అక్కడికక్కడే మరణించాడు. సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న పోలీసులు వారిద్దరినీ అరెస్ట్ చేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంత్రుల కమిటీ

ప్యారీస్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు మంత్రులతో కూడిన ప్రత్యేక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆదివారం సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని, వీటిని పరిశీలించి తగిన నిర్ణయం తీసుకొనేలా మంత్రులతో కూడిన కమిటీని నియమిస్తూ ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించినట్లు ఆ ప్రకటనలో తెలిపింది. ఈ కమిటీలో ప్రజాపనుల శాఖ మంత్రి ఏవీ వేలు, ఆర్థిక శాఖ మంత్రి తంగం తెన్నరసు, పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్, మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి కయల్‌విళి సెల్వరాజ్ సభ్యులుగా ఉన్నారు. వీరు సోమవారం సచివాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల వినతిపత్రాలను పరిశీలించి సంఘ ప్రతినిధులతో చర్చలు జరుపుతారు.

26న 'మాస్' వ్యవస్థాపక దినోత్సవం

ప్యారీస్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మద్రాసు ఆదిఆంధ్ర అరుంధతీయ ఆదివాసీ సంక్షేమ సంఘం-చెన్నై (మాస్) 29వ వ్యవస్థాపక దినోత్సవం ఈ నెల 26న జరుగనుంది. ఎగ్మూర్‌లోని ఇస్కా సెంటర్‌లో బుధవారం సాయంత్రం 5 గంటలకు మాస్ అధ్యక్షుడు డా.కొల్లి రాజు అధ్యక్షతన నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి హజరత్తయ్య, ఉపాధ్యక్షుడు నూనె శ్రీనివాసులు అతిథులను పరిచయం చేయనున్నారు. ముఖ్యఅతిథిగా ఇన్‌కమ్‌టాక్స్ డిప్యూటీ కమిషనర్ రత్నరాజు వీసా, గౌరవ అతిథులుగా ఎ.జైసన్, రాష్ట్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి జీసీ నాగూర్, ఐటీ రిటైర్డ్ అధికారి బి.విజయ్ అనీల్‌కుమార్ సహా పలువురు ప్రముఖులు పాల్గొంటారని డా.కొల్లి రాజు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

ఆన్‌లైన్ వ్యాపారం పేరిట రూ.12 లక్షల మోసం

పెరంబూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ వ్యాపారంలో అధిక లాభాలు ఆర్జించవచ్చని నమ్మించి రూ.12లక్షలు మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్‌చేసిన పోలీసులు, పరారీలోఉన్న మరికొందరి కోసం గాలిస్తున్నారు. ఈ మేరకు గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ ఆదివారం విడుదలచేసిన ప్రకటనలో... పొన్నియంబేడు అన్నపూర్ణ నగర్‌కు చెందిన శ్రీప్రియ విరుగంబాక్కంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయులిగా పనిచేస్తోంది. వడపళని అళగిరి మెయిన్ రోడ్డులో ఆన్‌లైన్ ట్రేడింగ్ కంపెనీ నడుపుతున్న శివకుమార్, వినితలతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఆన్‌లైన్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టి మంచి లాభం సంపాదించవచ్చని శివకుమార్ మాటలు నమ్మిన శ్రీప్రియ 2019లో పలు విడతలుగా రూ.12లక్షలు అందజేసింది. చాలా కాలమైనా లాభాలు లేకపోగా పెట్టుబడి నగదు కూడా ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన శ్రీప్రియ వడపళని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసిన పోలీసులు పరారీలో ఉన్న శివకుమార్, వనితసహా మరికొందరి కోసం పలు ప్రాంతాల్లో గాలిస్తున్నారు. ఈ కేసు విచారిస్తున్న న్యాయస్థానం, శివకుమార్ సహా మరికొందరిపై పీడీ వారెంట్ జారీచేసింది. దీంతో, సేలం జిల్లా ఆతూర్ తాలూకా పూంగవాడికి చెందిన శివకుమార్‌ను శుక్రవారం అరెస్ట్ చేసిన పోలీసులు, వనిత, మరికొందరి కోసం గాలిస్తున్నారు.

తెన్‌పెన్నైయారు వద్ద తవ్వకాల్లో

బయల్పడిన పురాతన మట్టి ముంత

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా పన్రుట్టి సమీపం తెన్‌పెన్నైయారు వాగు వద్ద పురావస్తు పరిశోధకులు జరిపిన తవ్వకాల్లో రెండువేల సంవత్సరాల నాటి మట్టి ముంత, తమిళ ప్రాచీన అక్షరాలు, గుర్తులు కలిగిన ఎరుపు తెలుపు రంగుతో కూడిన మట్టిపెంకులు లభ్యమయ్యాయి. ప్రముఖ పురావస్తు పరిశోధకుడు ఇమ్మానువేల్, విల్లుపురం అరింజర్ అన్నా ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల చారిత్రక విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థి రాహుల్, చారిత్ర పరిశోధకుడు ప్రతాప్ పర్యవేక్షణలో ఈ తవ్వకాలు జరిగాయి. గతంలో రాజరాజచోళుడి కాలం నాటి రాగి నాణెం, 1200 యేళ్లనాటి పల్లవుల కాలానికి చెందిన వినాయకుడి శిల్పం, దీపాలు, మట్టితో తయారైన హుక్కా తదితర వస్తువులు లభ్యమయ్యాయి.



లభ్యమైన రెండువేల ఏళ్లనాటి మట్టి ముంత, మట్టి పెంకులు

తేని జిల్లాలో సారా, గుట్కా స్వాధీనం

● మధ్యప్రదేశ్‌కు చెందిన 12 మంది అరెస్టు

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా బోడినాయకనూరు మీదుగా కేరళకు వ్యాన్లలో కల్తీసారా, గుట్కా, నిషేధిత పొగాకు వస్తువులను తరలిస్తున్న మధ్య ప్రదేశ్‌కు చెందిన 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. బోడినాయకనూరు మీదుగా కేరళకు కార్మికుల ముసుగులో కొందరు కల్తీసారా, గుట్కా పొగాకు వస్తువులను తరలిస్తున్నారనే సమాచారంతో బోడినాయకనూరు ఎస్ఐ కృష్ణవేణి ముందల్ ప్రాంతం చెక్‌పోస్టు వద్ద శనివారం రాత్రంతా వాహనాలు తనిఖీ చేశారు. ఆదివారం వేకువజామున ఉత్తరాది రాష్ట్రాల రిజిస్ట్రేషన్ నెంబర్ కలిగిన రెండు వ్యాన్లు వేగంగా వెళ్లటంతో నిలిపి సోదా చేశారు. వాటిలో సుమారు యాభై క్యాన్లలో కల్తీసారా, ముప్పై పార్శిల్స్‌లో గుట్కా, తదితర పొగాకు వస్తువులు ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. వ్యాన్లలో ప్రయాణించిన మధ్యప్రదేశ్ టిండోరి జిల్లాకు చెందిన గిరిబల్‌సింగ్ మరవి (39), దీపక్ ఉక్కే (31), సంజయ్‌కుమార్ (30), అమృత్‌కుమార్ కైరవార్ (25), లలిత్ (19), వీరేష్ ఉక్రే (35), శివం భన్వసి (26) లలిత్‌కుమార్ ధర్వయ్యా (24), ముకేష్ (27) అనిష్ యాదవ్ (29), తులసీరామ్ దుర్వారే (40), అరవింద్ మార్వీ (22) అనే 12 మందిని అరెస్టు చేశారు.



బోడినాయకనూరు ముందల్ చెక్‌పోస్ట్ వద్ద స్వాధీనం చేసుకున్న గుట్కా వస్తువులను పరిశీలిస్తున్న పోలీసులు

రక్షణ సైన్యం నూతన కార్యవర్గ పదవీ స్వీకారం

ప్యారీస్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక విల్లివాక్కం నియోజకవర్గ పరిధిలోని అయనావరం రైల్వే క్వార్టర్స్‌లో ఉన్న సాల్వేషన్ ఆర్మీ-ఐసీటీ 2025 నూతన కార్యవర్గ పదవీ స్వీకారోత్సవం ఆదివారం జరిగింది. కోర్ కమాండింగ్ ఆఫీసర్లు లెఫ్టినెంట్ ఎం.ఇమ్మానుయేలు-నివేదిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డివిజినల్ కమాండర్స్ మేజర్ జాన్ కల్విన్-విమల్‌రీనా పాల్గొని నూతన కార్యవర్గ కమిటీని పరిచయం చేశారు. కోర్ సెక్రటరీగా సూరిపోగు థామస్, కోర్ సార్జంట్ మేజర్‌గా చల్లగాలి నోవా సహా బలభద్ర సుమన్, సాల్మన్, గొల్లపల్లి ప్రభుదాస్, తార ఊర్మిల, ఆరోగ్యమేరీ కిరణ్, ఎం.ఉమ, విన్సెంట్ మేరీ, ఆర్.మోనిక, ఎ.చిరంజీవి, ఎం.రమేష్, పి.పురుషోత్తం, ఎస్.సంగీత, జె.టాల్‌స్టాయ్ ఈ ఏడాది డిసెంబరు వరకు తమకు అప్పగించిన పదవుల్లో కొనసాగనున్నారు. కార్యక్రమంలో ప్రపంచ దేశాల్లో శాంతి నెలకొనాలని, రోగుల స్వస్థత కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



నూతన కమిటీతో మేజర్ జాన్ కల్విన్, విమల్ రీనా, లెఫ్టినెంట్ ఎం.ఇమ్మానుయేలు, నివేదిత తదితరులు

వీఈఎఫ్ఐ ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్

అడయార్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరువళ్ళూర్ జిల్లా కొడుంగయూరు, ఎళిల్ నగర్‌లోని మోడల్ ప్రైమరీ పాఠశాలలో రూరల్ ఎడ్యుకేషన్ ఇనిషియేటివ్ సెంటర్ ఫర్ ఇండియా (వీఈఎఫ్ఐ) ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.. ఇందులో రివైజ్ ఇంజనీరింగ్ అనే అంశంపై ఆధునిక వినియోగంలో శాస్త్ర సాంకేతిక సాధనాలు, వాటి అప్లికేషన్స్, పారిశ్రామిక టెక్నాలజీని ప్రముఖ కవి వడలూరు ఆదిరాయ్ ప్రారంభోత్సవం చేశారు. కంప్యూటర్ ద్వారా రివర్స్ ఇంజనీరింగ్ విధానాన్ని విద్యార్థులకు టెక్ నిపుణుడు జె.అన్బుమణి వివరించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం ధనమ్ కుమార్ అధ్యక్షత వహించగా, మేకర్స్ క్లబ్ నిర్వాహకులు, పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఎదురెదురుగా ఢీకొని రెండు లారీల దగ్ధం

● మంటల్లో చిక్కుకుని డ్రైవర్ మృతి

● ఇద్దరికి గాయాలు

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై సమీపం పాచ్చల్ ప్రాంతం వద్ద ఆదివారం వేకువజాము రెండు లారీలు ఢీకొని దగ్ధమైన దుర్ఘటనలో ఓ డ్రైవర్ మంటల్లో చిక్కుకుని మృతి చెందాడు. మరో లారీ డ్రైవర్, క్లీనర్ తీవ్రంగా గాయపడ్డారు. తిరువణ్ణామలై నుండి సిమెంట్ మిశ్రమం లోడ్‌తో ఓ ట్యాంకర్ లారీ తిరువణ్ణామలై - బెంగళూరు జాతీయరహదారిలో ధర్మపురి వైపు బయలుదేరింది. ట్యాంకర్ లారీకి అరియలూరు జిల్లాకు చెందిన రఘు డ్రైవర్‌గా ఉన్నారు. పాచ్చల్ సమీపంలో ట్యాంకర్ లారీ వెళ్తుండగా ఎదురుగా వేగంగా వచ్చిన గూడ్సు లారీ అదుపు తప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు లారీలకు నిప్పంటుకుంది. కొద్ది సేపటికే రెండు లారీలు పూర్తిగా దగ్ధమయ్యాయి. మినీ గూడ్సు లారీని నడిపిన డ్రైవర్ ప్రతాప్ మంటల్లో చిక్కుకుని దుర్మరణం చెందాడు. ట్యాంకర్ లారీలో ఉన్న క్లీనర్ కిందకు దూకి ప్రాణాలను కాపాడుకోగలిగాడు. ట్యాంకర్ లారీ డ్రైవర్ రఘు మంటల్లో చిక్కుకుని గాయపడ్డాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని డ్రైవర్ రఘును చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదం కారణంగా తిరువణ్ణామలై - బెంగళూరు జాతీయ రహదారిలో గంటకు పైగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.



రోడ్డు ప్రమాదంలో దగ్ధమైన లారీలు

పార్టీ పగ్గాలు చేపట్టండి...!

● మదురైలో శశికళ మద్దతుదారుల పోస్టర్ల కలకలం

పెరంబూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్ర జ్యోతి): 'దిశా నిర్దేశం లేకుండా నడుస్తున్న అన్నాడీఎంకే ఓడను నడిపించే బాధ్యతలు చేపట్టండి' అంటూ శశికళ మద్దతుదారులు మదురై వేసిన పోస్టర్లు కలకలం రేపుతున్నాయి. దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత 77వ జయంతి సందర్భంగా ఉసిలంబట్టి పీఎండీ కళాశాల ప్రాంగణంలో జయ చిత్రపటానికి ఆమె స్నేహితురాలు శశికళ నివాళులర్పించనున్నారు. ఈ కార్యక్రమం కోసం శశికళ ఆదివారం నగరం నుంచి మదురైకి బయల్దేరి వెళ్లారు. ఆమె రాక సందర్భంగా ఆమె మద్దతుదారులు పార్టీ నాయకత్వ బాధ్యతలు చేపట్టాలంటూ ముద్రించిన పోస్టర్లు అన్నాడీఎంకే శ్రేణుల్లో కలకలం రేపాయి.



శశికళ మద్దతుదారులు ముద్రించిన పోస్టర్

ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం



అతిథులను సత్కరిస్తున్న పాఠశాల నిర్వాహకులు

తిరుత్తణి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పల్లిపట్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ద్వితీయ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీటీఏ అధ్యక్షుడు సీజే సెందిల్ కుమార్, వార్డు కౌన్సిలర్లు చిరంజీవి, మురళి, గుణశేఖర్, భాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లో రాణిస్తూ సమాజ సేవలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. విద్యలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం ధనుంజయుడు అధ్యక్షత వహించగా, పీటీఏ సభ్యులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు సభికులను ఆకట్టుకున్నాయి.

కుటుంబంలో విషాదం..

నీట మునిగి ఇద్దరు చిన్నారుల దుర్మరణం

పెరంబూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులతో పొలానికి వెళ్లిన ఇద్దరు చిన్నారులు నీటమునిగి మృతిచెందిన ఘటన నీలగిరి జిల్లాలో ఆదివారం చోటుచేసుకుంది. ఊటీ జాతీయ రహదారి సమీపంలోని టీఆర్ బజార్ ప్రాంతానికి చెందిన సతీష్‌కుమార్-షాలిని దంపతులకు నితీష్ (5), ప్రణిత (3) అనే పిల్లలున్నారు. సతీష్‌కుమార్ అదే ప్రాంతంలోని తోటలో వ్యవసాయం చేస్తుంటాడు. ఆదివారం ఉదయం 10 గంటలకు షాలిని పిల్లలతో కలసి తోటలోకి వెళ్లగా, సతీష్‌కుమార్ రేషన్ దుకాణానికి వెళ్లాడు. కొద్దిసేపటికి సమీపంలో ఆడుకుంటున్న పిల్లలిద్దరూ కనిపించకపోవడంతో తల్లి వారి కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించింది. తోటలోని వ్యవసాయ బావిలో పిల్లలిద్దరూ మృతిచెంది ఉండడాన్ని గమనించి షాలిని విలపించింది. సమాచారం అందుకున్న నడువట్టం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఎక్స్‌ప్రెస్ రైలు



ప్రమాద స్థలంలో గుమికూడిన స్థానికులు

పెరంబూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం సమీపంలో ట్రాక్టర్ ట్రాలీ రైలు పట్టాల మధ్యలో నిలిచిన సమయంలో, ఆ మార్గంలో వచ్చిన ఎక్స్‌ప్రెస్ ఢీకొంది. నాగర్‌కోయిల్ నుంచి ముంబై వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం విల్లుపురం, తిరువెన్నైనల్లూర్ సమీపంలో ఆనైవారి గ్రామం మీదుగా వెళుతుండగా ట్రాలీతో ఉన్న ట్రాక్టర్ మానవరహిత రైల్వేగేటు దాటుతుండగా హఠాత్తుగా మరమ్మతులకు గురై పట్టాలపై నిలిచిపోయింది. దీంతో డ్రైవర్ ట్రాలీ నుంచి ఇంజన్ వేరుచేసి పక్కకు తీసుకెళ్లాడు. అదే సమయంలో వచ్చిన ముంబై ఎక్స్‌ప్రెస్ ట్రాలీని ఢీకొంది. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగకపోయినా, ఆ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, ఇంజనీర్లు, సిబ్బంది అక్కడకు చేరుకొని ఇంజన్‌లో చిక్కిన ట్రాలీ తొలగించారు.

26 నుంచి లాయర్ల విధుల బహిష్కరణ


పెరంబూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కోర్టు విధులు బహిష్కరించనున్నట్లు న్యాయవాదుల సంఘం ప్రకటించింది. నగరంలో తమిళనాడు, పుదుచ్చేరి న్యాయవాదుల సంఘం సమావేశం శనివారం జరిగింది. కేంద్ర ప్రభుత్వం తాజాగా చేపట్టనున్న న్యాయవాదుల చట్ట సవరణ సత్వరం ఉపసంహరించుకోవాలని, ఈ డిమాండ్‌తో ఈ నెల 26 నుంచి మార్చి 1వ తేది వరకు కోర్టు విధులు బహిష్కరించాలని సమావేశంలో తీర్మానం చేసినట్లు ఆ సంఘం ప్రతినిధులు తెలిపారు.

మూడు రోజులు వర్షసూచన

పెరంబూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, పుదుచ్చేరిలో కొద్దిరోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. అంతర్ జిల్లాల్లో 32 నుంచి 37 డిగ్రీలు, సముద్రతీర జిల్లాలు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో 30-35 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తమిళనాడు, పుదుచ్చేరిలో రానున్న 48 గంటల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీల వరకు పెరుగనున్నాయి. ఇదిలా ఉండగా, ఈ నెల 25 నుంచి 28వ తేది వరకు తమిళనాడు, పుదుచ్చేరిలో తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ, పగటి ఉష్ణోగ్రతలు 33 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 23 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది.

● విద్యార్థినిపై అత్యాచారం కేసు...

జ్ఞానశేఖరన్‌పై 7 చోరీ కేసుల నమోదు




జ్ఞానశేఖరన్, అతడి లగ్జరీ కారు

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అన్నావర్సిటీ విద్యార్థినిపై జరిగిన అత్యాచారం కేసు నిందితుడు జ్ఞానశేఖరన్‌పై పోలీసులు తాజాగా 7 చోరీ కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. ఆ సందర్భంగా వంద సవర్ల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. పళ్ళికరణైలో జరిగిన చోరీ కేసులో జ్ఞానశేఖరన్‌కు సంబంధాలున్నట్లు పోలీసులు జరిపిన విచారణలో వెల్లడైంది. ఆ మేరకు పళ్ళికరణై పోలీసులు అతడి వద్ద విచారణ జరిపి నగలను, లగ్జరీ కారును కూడా స్వాధీనం చేసుకున్నారు.

జయలలితకు నేడు ప్రభుత్వం తరఫున నివాళి

పెరంబూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలితకు ప్రభుత్వం తరఫున నివాళులర్పించనున్నారు. ఈ మేరకు సచివాలయం ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... జయలలిత 77వ జయంతి సందర్భంగా మెరీనా బీచ్ కామరాజర్ రోడ్డు సమీపంలోని తమిళనాడు ఉన్నత విద్య మండ్రం ప్రాంగణంలోని ఆమె విగ్రహానికి సోమవారం ఉదయం మంత్రులు, అధికారులు నివాళులర్పించనున్నారని తెలిపింది.



అజిత్ కారు ప్రమాద దృశ్యం

మళ్లీ ప్రమాదం నుంచి తప్పించుకున్న అజిత్

అగ్రహీరో అజిత్ కుమార్ మరోమారు కారు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. స్పెయిన్‌లో జరుగుతున్న కార్ రేసింగ్ పోటీలకు హాజరయ్యారు. ఇందుకోసం ఆయన గత కొన్ని రోజులుగా శిక్షణ పొంది సోమవారం కార్ రేస్ పోటీల్లో పాల్గొన్నారు. ఆ సమయంలో తాను నడుపుతున్న కారుకు మరో కారు అడ్డంగా వచ్చింది. దాన్ని తప్పించబోయిన అజిత్ ఆ కారును ఢీకొట్టింది. దీంతో అజిత్ కారు మూడుసార్లు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదం నుంచి అజిత్ అదృష్టవశాత్తు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాదం జరిగిన తర్వాత అజిత్ తేలికపాటి గాయాలతో తన కారులో నుంచి బయటకు రావడంతో ఆయన బృందం సభ్యులతో పాటు నిర్వాహకులు ఊపిరిపీల్చుకున్నారు. అజిత్ కుమార్ రేసింగ్ కారు ప్రమాదానికి గురైన వీడియో అజిత్ కుమార్ రేసింగ్ టీం ఇన్‌స్టాఖాతాలో షేర్ చేయడంతో అది వైరల్‌గా మారింది.

జీవీ ప్రకాష్‌తో ఆ రిలేషన్ లేదు : దివ్యభారతి



ప్రముఖ సంగీత దర్శకుడు, హీరో, నిర్మాత జీవీ ప్రకాష్ కుమార్‌కు తనకు మధ్య రిలేషన్ ఉన్నట్టు సాగుతున్న ప్రచారంలో రవ్వంత కూడా నిజం లేదని హీరోయిన్ దివ్యభారతి స్పష్టం చేశారు. ప్రస్తుతం వీరిద్దరూ కలిసి నటించిన కొత్త చిత్రం 'కింగ్‌స్టన్'. వచ్చే నెల 7వ తేదీ తమిళం, తెలుగు, హిందీ భాషల్లో రిలీజ్ చేస్తున్నారు. ఈ చిత్రం ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా దివ్యభారతి మాట్లాడుతూ, 'ఈ సినిమాలో నటించడానికి ముందే కొన్ని రోజుల పాటు రిహార్సల్ చేశాను. డైలాగ్ డెలివరీ, యాక్టింగ్, బాడీ లాంగ్వేజ్ తదితర అంశాలపై శిక్షణ పొందాను. ఇప్పటివరకు ఏ ఒక్క చిత్రానికి ఈ తరహాలో శ్రమించలేదు. జీవీ ప్రకాష్ ఒక స్వీట్ ఫ్రెండ్. అతనితో ఏమాత్రం గర్వం లేదు. ఎపుడూ ప్రశాంతంగా ఉంటారు. మనం కల్పించుకుని మాట కలిపితేనే మాట్లాడుతారు. ఒక మంచి కో-ఆర్టిస్ట్. అంతే కానీ, బాహ్య ప్రపంచంలో సాగుతున్నట్టుగా మా ఇద్దరి మధ్య ఎలాంటి సంబంధం లేదు. మా ఇద్దరి గురించి బయట జరుగుతున్న ప్రచారంలో రవ్వంత కూడా నిజంలేదు. అయితే, ఈ ప్రచారాన్ని పలువురు ప్రస్తావిస్తుంటే బాధగా ఉంది. దీన్ని పట్టించుకోవద్దని, దిగులుపడొద్దని జీవీ ప్రకాష్ నాకు సూచించారు' అని పేర్కొన్నారు. కాగా, జీవీ ప్రకాష్ హీరోగా నటించిన 'బ్యాచిలర్' మూవీతో దివ్యభారతి కోలీవుడ్ వెండితెరకు పరిచయమైన విషయం తెల్సిందే. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య రిలేషన్ ఉందంటూ ప్రచారం సాగుతోంది.

హిమాలయాల్లో జరిగిన యధార్థ గాథ



'మిస్టర్ ఎక్స్' ఆడియో రిలీజ్ వేడుకలో చిత్ర బృందం

తమిళ చిత్రజ్యోతి



● నిర్మాత కె.లక్ష్మణ్ కుమార్

హిమాలయ పర్వత శ్రేణుల్లో 1966లో జరిగిన వాస్తవ కథ ఆధారంగా 'మిస్టర్ ఎక్స్' మూవీ తెరకెక్కిందని ఈ చిత్ర నిర్మాతల్లో ఒకరైన ప్రిన్స్ పిక్చర్స్ అధినేత కె.లక్ష్మణ్ కుమార్ తెలిపారు. 'లబ్బర్ పందు' వంటి మెగా బ్లాక్ బస్టర్ హిట్ మూవీ తర్వాత ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై సహ నిర్మాత వెంకటేష్‌తో కలిసి నిర్మించిన తాజా చిత్రం 'మిస్టర్ ఎక్స్'. ఆర్య హీరోగా నటించగా, ఇతర పాత్రల్లో గౌతమ్ కార్తీక్, శరత్ కుమార్, మంజు వారియర్, అనకా, అతుల్యా రవి, రైజా విల్సన్, కాళి వెంకటట్ తదితరులు నటించారు. అరుణ్ విన్సెంట్ ఛాయాగ్రహణం అందించగా దిబునినన్ సంగీత స్వరాలు సమకూర్చారు. మను ఆనంద్ దర్శకుడు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్, టీజర్ రిలీజ్ శనివారం రాత్రి నగరంలో జరిగింది. ఇందులో నిర్మాత లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, 'చాలాకాలం ప్లాన్ చేసి తీసిన మూవీ. 'ఎఫ్ఐఆర్' సినిమా పూర్తి చేసిన వెంటనే మను ఆనంద్ ఈ స్టోరీ చెప్పగా, అందులోని ఏ ఒక్క అంశం నమ్మశక్యంగా లేదు. 1965లో చైనాను ఎదుర్కొనేందుకు భారత నిఘా వర్గాలు ఏడు ప్లుటోనియం క్యాప్సూల్స్ తీసుకెళ్ళాయి. కానీ, అనుకోకుండా అవి మిస్ అవుతాయి. ఇప్పటివరకు అవి ఎక్కడున్నాయో గుర్తించలేదు. 1977లో అమెరికాలోని ఓ పత్రికలో వచ్చిన వార్తాకథనంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఇదే ఈ సినిమాకు ఆరంభం. పోలీసులు, సైనికుల ప్రతిభకు గుర్తింపు ఉంది. కానీ, నిఘా వర్గాల్లో పనిచేసే వారు ఎవరో ఎవరికీ తెలియదు. 'సర్దార్' సినిమా కోసం పనిచేసిన ఇద్దరు నటుల తండ్రులు కూడా అలాంటివారే. ఈ సినిమాలో నటించిన ప్రధాన నటీనటులంతా యాక్షన్ సీన్స్‌లో నటించారు. తప్పకుండా ప్రేక్షకులకు ది బెస్ట్ థియేట్రికల్ అనుభూతిని ఇస్తుందని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు. హీరో ఆర్య మాట్లాడుతూ, 'ఈ సినిమా రియల్ హీరో నిర్మాత లక్ష్మణ్ కుమార్. ఈ ప్రాజెక్టుకు హీరోగా సిఫార్సు చేసింది కూడా ఆయనే. కానీ, భారీ బడ్జెట్ అవుతుందని నిర్మాతకు చెప్పగా, ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసేలా థియేటర్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే విషయంలో ఖర్చుకు వెనుకాడనని చెప్పారు. మను ఆనంద్ ప్రతి ఒక్క విషయంలోనూ ఖచ్చితత్వాన్ని పాటించే దర్శకుడు. గౌతమ్ కార్తీక్ చాలా బాగా నటించాడు' అన్నారు. ఆ తర్వాత చిత్రంలో నటించిన నటీనటులు తమతమ అభిప్రాయాలను పంచుకున్నారు.



'మడల్' ప్రారంభ పూజ కార్యక్రమం

హిస్టారికల్ హర్రర్ మూవీగా 'మడల్'

పీజేఎస్ పిక్చర్స్ పతాకంపై 'మడల్' పేరుతో భారీ బడ్జెట్‌తో ఓ చిత్రం తెరకెక్కనుంది. ఈ చిత్రం షూటింగ్ ఆదివారం నగరంలో పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. కలెక్టియస్ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్లలో ఒకరైన ప్రశాంత్ జాసన్ శామ్యూల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'సిల నేరంగలిల్ సిల మనిదర్‌గల్', సంతానం హీరోగా నటించిన 'ఇంగ నాంగ దాన్ కింగ్' మూవీలో నటించిన ప్రియాలయ హీరోయిన్‌గా నటిస్తున్నారు. వీరితోపాటు ఇతర పాత్రల్లో నిశల్‌గల్ రవి, బాలశరవణన్, వివేక్ ప్రసన్న, కృష్ణ దయాళ్ నటిస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, రచన, దర్శకత్వం హరిశంకర్ రవీంద్రన్. ఈ సినిమా షూటింగ్ ప్రారంభోత్సవ పూజా కార్యక్రమం ఆదివారం నగరంలో జరిగింది. ఇందులో హీరో మణికంఠన్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. రెగ్యులర్ షూటింగ్ మార్చి నుంచి జరుగనుంది. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'ఇది హిస్టారికల్ మిక్స్‌డ్ హర్రర్ మూవీ. వందేళ్ళ క్రితం జరిగిన తమిళ సంస్కృతికి సంబంధించిన యదార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కిస్తున్నాం. తమిళ చిత్రసీమలో హర్రర్‌లో ఇంతవరకురాని కొత్త కథాంశాన్ని ఈ చిత్రంలో చూస్తారు. ఇది అభిమానులకు కొత్త అనుభూతిని పంచుతుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

ఏసీ సబర్బన్ రైలు ట్రయల్ రన్ విజయవంతం



ప్యారీస్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూర్‌లోని ఐసిఎఫ్‌లో హైటెక్ వసతులతో రూపొందించిన ఏసీ సబర్బన్ విద్యుత్ రైలు ట్రయల్ రన్ ఆదివారం తాంబరంలో విజయవంతంగా జరిగింది. ఈ రైలు వచ్చే నెల నుంచి చెన్నై బీచ్-తాంబరం మధ్య ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. ప్రయాణికుల రద్దీ సమయాలైన ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ రైళ్ల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోనున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. మహానగరం చెన్నై, శివారు ప్రాంతాలు కలిపేలా ప్రతిరోజు విద్యుత్ రైళ్లను నడుపుతున్నారు. ఈ రైళ్ల ద్వారా ప్రజలు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తక్కువ ఖర్చుతో సకాలంలో చేరుకుంటున్నారు. ప్రధానంగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఉద్యోగులు, కళాశాల, పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు, వ్యాపారులు ఈ రైళ్ల సేవల ద్వారా లబ్ధిపొందుతున్నారు. చెన్నై బీచ్-తాంబరం-చెంగల్పట్టు మార్గంలో, చెన్నై సెంట్రల్-ఆవడి-తిరువళ్లూర్, చెన్నై సెంట్రల్-గుమ్మిడిపూండి మార్గంలో ఏసీ బోగీలు లేని విద్యుత్ రైళ్లు నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో, ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పిస్తూ ఏసీ బోగీలతో కూడిన విద్యుత్ సబర్బన్ రైలు సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం 1,116 మంది కూర్చొని, 3,798 మంది నిలబడి ప్రయాణం చేసేలా ఐసిఎఫ్ ఈ రైలు బోగీలు డిజైన్ చేసింది.

భక్తిశ్రద్ధలతో సమారాధన



తిరుమల పాదయాత్ర కైంకర్యదారులతో గురుస్వామి భక్తవత్సలం

ప్యారీస్, ఫిబ్రవరి 23: స్థానిక పెరంబూర్ కందపిల్ల వీధిలోని శివా విష్ణు సేవార్థిగళ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం సమారాధన గురుస్వామి భక్తవత్సలం సారధ్యంలో జరిగింది. ట్రస్ట్ ఆధ్వర్యంలో 44వ వార్షిక తిరుమల పాదయాత్ర ఈ నెల 16న ప్రారంభం కాగా ఇందులో 1,008 మంది భక్తులు పాల్గొని శ్రీవారిని దర్శనం చేసుకొని విజయవంతంగా తిరిగొచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం వెంకటేశ్వర సుప్రభాతం, హారతి, భజన కార్యక్రమాలు, అనంతరం పాదయాత్ర విజయవంతానికి సహకరించిన కైంకర్యదారుల సత్కారం జరిగింది.. పాదయాత్ర రోజుల్లో భక్తులకు ఉదయం నుంచి రాత్రి వరకు భోజన, బస, తిరుమల శ్రీవారి దర్శనానికి సహకరించిన ట్రస్ట్ నిర్వాహకులు పీవీ కృష్ణారావు సహా దాతలకు గురుస్వామి భక్తవత్సలం కృతజ్ఞతలు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన నిర్వహించారు.



యువత మత్తుకు దూరంగా ఉండాలి

● పోలీస్ జాయింట్ కమిషనర్ విజయకుమార్

ప్యారీస్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని లక్ష్యంతో ముందుకు సాగాలని గ్రేటర్ చెన్నై పోలీసు జాయింట్ కమిషనర్ డా.పి.విజయకుమార్ పిలుపునిచ్చారు. నగరంలో ఆదివారం ఉదయం మాదకద్రవ్యాల వలన ఆరోగ్యానికి కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ నిర్వహించిన పీస్ ర్యాలీలో నగరంలోని పలు కళాశాలలకు చెందిన 2,700 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. రోటరీ 120వ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ట్రిప్లికేన్ ఐస్‌హౌస్ లేడి వెల్లింగ్టన్ పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో ఈ ర్యాలీని జెండా ఊపి విజయకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటీవల కాలంలో యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి నేరాలకు పాల్పడుతున్నారని, వీరికి అవగాహన కల్పించేలా ఇలాంటి ర్యాలీలు విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. క్వీన్ మేరీస్ మహిళా కళాశాల సహకారంతో నిర్వహించిన ఈ ర్యాలీకి రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 32,34 జిల్లా గవర్నర్ ఎన్ఎస్ శరవణన్, నిర్వాహకులు ఎస్.రవి, విద్యారఘు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సునీల్ నేతృత్వంలో 'క్యారమ్' పోటీలు



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

అడయార్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ పురట్చి తలైవి జయలలిత 77వ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో క్యారమ్ పోటీలను నిర్వహించారు. టి.నగర్‌లోని పార్టీ కార్యాలయంలో దక్షిణ చెన్నై విభాగం పరిధిలో నిర్వహించగా మొత్తం 64 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీ విజేత వి.ప్రకాష్ - ఎస్.నరేన్‌లకు మొదటి బహుమతిగా రూ.50 వేలు, రన్నరప్‌గా నిలిచిన వి.సురేష్ కుమార్ - కరాటే ఎస్.శేఖర్‌లకు రూ.30 వేలు చొప్పున నగదు బహుమతిని మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.మురుగానందం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని 136వ విభాగం పార్టీ కార్యకర్తలు ఎస్ఆర్ సూర్య రమేష్ ఏర్పాటుచేయగా, ఇందులో మాంబాళం ఎస్.జయరామన్, ఎస్.సురేష్ కుమార్, పార్టీ కార్యకర్తలు, క్రీడాకారులు, స్థానికుల భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎం మాటలకు స్పందించిన బాలిక

● సహాయనిధికి రూ.10వేల విరాళం



నన్‌ముగై

చెన్నై,ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి నిధులు రాకున్నా ఉపాధ్యాయులను తమ ప్రభుత్వ నిధులతోనే కాపాడుకుంటూ వస్తున్నామని ముఖ్యమంత్రి స్టాలిన్ 'తల్లిదండ్రులను గౌరవిద్దాం' కార్యక్రమంలో చేసిన ప్రకటన కడలూరులోని ఓ బాలిక మనసును కదిలించి వేసింది. కేంద్ర నిధులతో నడుపుతున్న సమగ్ర శిక్షా అభియాన్ పథకం కింద పనిచేస్తున్న ఉపాధ్యాయుల కోసం తన వంతు సాయంగా ఆమె రూ.10వేల విరాళం ప్రకటించింది. శనివారం మధ్యాహ్నం కడలూరు సభలో సీఎం స్టాలిన్ ప్రసంగిస్తూ జాతీయ విద్యా విధానాన్ని అంగీకరిస్తేనే రాష్ట్రంలో విద్యారంగానికి రూ.2వేల కోట్లు ఇస్తామని కేంద్రం చెబుతోందని, ఆ నిధులు విడుదల కాకపోవడంతో వేలాదిమంది టీచర్లు, విద్యార్థులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వమే వారిని కాపాడుతోందని ప్రకటించారు.ఈ నేపథ్యంలో కడలూరులో ఎల్‌కేజీ చదువుతున్న నన్‌ముగై అనే బాలిక తాను పొదుపుచేసి దాచుకున్న సొమ్ములో రూ.10 వేలను ముఖ్యమంత్రి సహాయనిధికి పంపింది. ఈ సంఘటనకు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో తీవ్రంగా వైరల్ అవుతోంది.

పెరియార్ ఆస్పత్రి పనులు త్వరితగతిన పూర్తిచేయండి



కొత్త ఆస్పత్రిలోని ఐసీయూ వార్డు పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పెరియార్‌నగర్‌లోని ప్రభుత్వ సబర్బన్ ఆసుపత్రి ప్రాంగణంలో రూ.210 కోట్లతో నిర్మిస్తున్న 'పెరియార్ ప్రభుత్వ ఆసుపత్రి' పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని సీఎం స్టాలిన్ ఆదేశించారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొళత్తూరు నియోజకవర్గ పరిధిలో పెరియార్‌నగర్‌లో కొత్తగా నిర్మిస్తున్న ఆస్పత్రి పనులను ఆదివారం ఉదయం పరిశీలించారు. ప్రస్తుతం 95 శాతం పనులు పూర్తికావటంవతో రెండు వారాల్లోగా ముఖ్యమంత్రి ఆస్పత్రిని ప్రారంభించనున్నారు. ఆ ఆసుపత్రి గ్రౌండ్ ఫ్లోర్‌లో 20 పడకల వార్డును, ఎంఆర్ఐ స్కాన్ తదితర పరికరాలను ఆయన పరిశీలించారు. ఆ తర్వాత అన్ని వార్డులను పరిశీలించారు.



'ముదల్వర్ పడైప్పగం'లో విద్యార్థులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

'ముదల్వర్ పడైప్పగం'లో తనిఖీ..

ఇదే విధంగా కొళత్తూరు జగన్నాథన్ వీధిలో 'ముదల్వర్ పడైప్పగం' (ముఖ్యమంత్రి సృజనాత్మక కేంద్రం) లోనూ స్టాలిన్ తనిఖీ చేశారు. ఉత్తర చెన్నై అభివృద్ధి పథకం కింద చెన్నై కార్పొరేషన్, మహానగర అభివృద్ధి సంస్థ (సీఎండీఏ) సంయుక్త ఆధ్వర్యంలో రూ.2.85 కోట్లతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు కో వర్కింగ్ స్పేస్, విద్యార్థుల కోసం స్టడీసెంటర్ తదితర సదుపాయాలతో దీనిని నిర్మించారు. ఆ కేంద్రంలో యూపీఎస్సీ, టీఎన్‌పీఎస్సీ తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులను, కో వర్కింగ్ స్పేస్‌లోని యువ పారిశ్రామిక వేత్తలను ఆయన కలుసుకుని కేంద్రంలో వసతులున్నాయా అని అడిగారు. ముఖ్యమంత్రితోపాటు మంత్రులు ఎం. సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, అన్బిల్ మహేష్‌పొయ్యామొళి, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్. ప్రియా, ఎంపీలు ఎ. రాజా, డాక్టర్ కళానిధి వీరాసామి తదితరులు పర్యటించారు.

తిరుత్తణి ఆలయంలో భక్తులకు మెరుగైన సదుపాయాలు



ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న అధికారులు, పోలీసులు

తిరుత్తణి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని అధికారులు నిర్ణయించారు. ప్రసిద్ధిచెందిన ఈ ఆలయానికి పొరుగు జిల్లాలు, ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణా సహా పలు రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో, ఆలయానికి వచ్చే భక్తులకు తగిన వసతులు లేవని ఫిర్యాదులందాయి. ఈ విషయమై స్పందించిన ఆలయ ధర్మకర్తల మండలి కమిటీ అధ్యక్షుడు శ్రీధరన్, తిరుత్తణి డీఎస్పీ కందన్ ఆదివారం కొండ ఆలయ ప్రాంగణం, కొండ దిగువ ప్రాంతాలను పరిశీలించారు. వేసవి ఎండ నుంచి భక్తులకు ఉపసమనం కలిగేలా క్యూలైన్లు, పరిసరాల్లో పందిళ్ల ఏర్పాటు, తాగునీరు, టాయిలెట్ల సౌకర్యం, భక్తులకు సరిపడా సిమెంటు కుర్చీలు, సీసీ కెమెరాల పెంపు తదితరాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. అలాగే ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచన చేశారు. కార్యక్రమంలో సీఐ మధిరసన్, ఆలయ ధర్మకర్తలు కె.మోహనన్, వి.సురేష్ బాబు, ఎం.నాగన్, ఆలయ సూపరింటెండెంట్ చిత్ర, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వేల్‌మురుగన్. ఇంజనీర్ నేతాజి తదితరులున్నారు.

చిదంబరంలో 26 నుంచి నాట్యాంజలి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాట్యాంజలి ట్రస్టు కార్యదర్శి ఎ. సంబంధం

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): చిదంబరం నాట్యాంజలి ట్రస్టు ఆధ్వర్యంలో 44 వ వార్షిక నాట్యాంజలి వేడుకలు ఈ నెల 26న ప్రారంభమవుతాయని ఆ ట్రస్టు కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది ఎ.సంబంధం తెలిపారు. చిదంబరంలో ఆదివారం మధ్యాహ్నం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నాట్యాంజలి వేడుకలు మార్చి 2 వరకు ఐదు రోజులపాటు జరుగుతాయని చెప్పారు. ఈ వేడుకల్లో నాటకాలు, కథక్, కూచిపూడి, మణిపురి నృత్యాల ప్రదర్శన ఉంటాయన్నారు. రాష్ట్రానికిచెందిన కళాకారులే కాకుండా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కళాకారులు, విదేశీ కళాకారులు సహా మొత్తం 450కిపైగా కళాకారులు పాల్గొంటారని చెప్పారు. ఈ సారి యువ కళాకారులకు అత్యంత ప్రాధాన్యం కల్పించినట్లు చెప్పారు. మీడియా సమావేశంలో నాట్యాంజలి ట్రస్టు చైర్మన్ డాక్టర్ ఆర్.ముత్తుకుమారన్, ఉపాధ్యక్షుడు శక్తి ఆర్.నటరాజన్, కోశాధికారి ఎం.గణపతి తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి యూనిటీ రన్ ప్రారంభిస్తున్న దృశ్యం

యూనిటీ రన్-2025 విజేతగా ప్రగధీశ్వరన్

అడయార్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత, మానసిక ఆరోగ్యం, మహిళలు, చిన్నారుల భద్రత, పర్యావరణ స్థిరత్వం తదితర అంశాలపై నగర వాసుల్లో అవగాహన కల్పించేలా 'యూనిటీ రన్ 2025' ఆదివారం నిర్వహించారు. వేళచ్చేరిలోని ఫీనెక్స్ మాల్ పల్లాడియం నుంచి ఈ మారథాన్ ప్రారంభమైంది. రాజ్యసభ్యుడు గిరిరాజన్, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ రాజ్ ప్రిన్స్ అరోన్, స్కూల్ డెవలప్‌మెంట్ స్టేట్ డిప్యూటీ సెక్రటరీ గౌతం జెండా ఊపి ఈ మారథాన్‌ను ప్రారంభించారు. మొత్తం 6 కిలోమీటర్ల వరకు సాగిన ఈ మారథాన్ వేళచ్చేరి వందడుగుల రోడ్డు, వేళచ్చేరి రైల్వే స్టేషన్ వరకు సాగి, తిరిగి ఫీనిక్స్ మాల్‌కు చేరుకుంది. ఇందులో ఔత్సాహిక రన్నర్లు, మాజీ అథ్లెట్లు తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల ముగింపులో మొదటి స్థానాన్ని ప్రగధీశ్వరన్, రెండో స్థానంలో నితిన్ కుమార్, మూడో స్థానంలో నిలిచిన తమిళమణిలకు నిర్వాహకులు బహుమతులందించి అభినందించారు. ఈ మారథాన్ పరుగులో దాదాపు 1400 మంది వరకు పాల్గొన్నారు.

కోలాహలంగా లాల్గుడి జల్లికట్టు

ప్యారీస్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా లాల్గుడి ప్రాంతంలో ఆదివారం నిర్వహించిన జల్లికట్టు ఉత్సాహంగా సాగింది. మైదానంలో రంకెలేస్తూ పరుగు తీసిన 400 పోట్లగిత్తలను అదుపుచేసేందుకు 400 మంది యువకులు సత్తాచాటారు. లాల్గుడి మారియమ్మన్ ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన జల్లికట్టులో తిరుచ్చి, తంజావూరు, పుదుకోట, పెరంబలూరు, అరియలూరు, కరూర్, మదురై, దిండుగల్ తదితర జిల్లాలకు చెందిన పోట్లగిత్తలకు అలాగే పశువైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి పోటీలో పాల్గొనేందుకు గుర్తింపుకార్డులు అందజేశారు. పోలీసు బందోబస్తు మధ్య ఉదయం 8.30 గంటలకు లాల్గుడి డీఆర్వో శివసుబ్రమణియన్ జెండా ఊపి ప్రారంభించిన జల్లికట్టులో ముందుగా వాడివాసల్ నుంచి ఆలయ ఎద్దును వదిలారు. 13 రౌండ్లుగా సాగిన ఈ పోటీల్లో పట్టుబడని 13 ఎద్దుల యజమానులకు, వాటిని అదుపుచేసిన యువకులకు బహుమతులు పంపిణీ చేసి అభినందించారు.

